

సంధ్యకు వివేకానంద సేవా పురస్కారం

షాద్‌నగర్, జనవరి 18: వివేకానంద సేవా పురస్కారానికి షాద్‌నగర్ వాసి డాక్టర్ సంధ్య ఎంపికైనట్లు ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్ గురువారం తెలిపారు. వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, సినీనటుడు, మాజీ మంత్రి బాబు మోహన్‌ల చేతుల మీదుగా అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

పోలింగ్ కేంద్రాల్లో 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్

- 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలి
- పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. శశాంక



రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 18 : ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈ నెల 6న ఓటర్ డ్రాఫ్ట్ జాబితా ప్రచురితమైందన్నారు. దానిలో క్లైమ్స్, అభ్యంతరాలకు ఈ నెల 22 వరకు అవకాశముందని తెలిపారు. డూప్లికేట్, చనిపోయిన వారి పేర్లు తొలగించాలని, అర్హులను ఓటరు జాబితాలో నమోదు చేయించాలని, అదేవిధంగా మార్పులు, చేర్పులకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఇంకా ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంటే తెలపాలని సూచించారు. ముఖ్యంగా 1,450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గం వారీగా ప్రతీవారం పొలిటికల్ పార్టీల మీటింగ్‌లు నిర్వహించి అన్ని విషయాలను తెలియజేస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో కూడా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఈనెల 20, 21 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటరు జాబితాతో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకునే విధంగా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




- ఈ నెలాఖరుతో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే
- లోక్‌సభ ఎన్నికల తరువాత ఒకేసారి స్థానిక ఎన్నికలకు కసరత్తు

"గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ఈ నెలతో ముగుస్తుంది. దీంతో వీటికి వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా.. పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తారా.. పర్సన్ ఇన్‌చార్జిలతో పాలన సాగిస్తారా.. లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా అన్న సందిగ్ధం అందరిలోనూ నెలకొంది. అయితే, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని తేలిపోయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. అప్పటి వరకు ప్రత్యేకాధికారులను నియమించాలన్న ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది. వీరి నియామకం కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు!

జాబితాను సిద్ధం చేస్తున్న సర్కార్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పంచాయతీ పాలకవర్గాల గడువు ఈ నెలాఖరు నాటికి ముగియనుండడంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇటీవలే రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికలకు కనీసం 45 రోజుల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలు పెడతారు. అయితే, ఇప్పటి వరకు అసలు పంచాయతీ ఎన్నికల ప్రక్రియనే మొదలు పెట్టలేదు. ఇంకా పట్టుమని 15 రోజుల గడువు కూడా లేకపోవడంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారానే పాలన సాగించేందుకు సర్కార్ చకచకా ఏర్పాట్లు చేస్తోంది. మండల స్థాయి అధికారులను పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు వివిధ కార్యాలయాల నుంచి జిల్లా పంచాయతీ అధికారులు సమాచారం తెప్పించుకుంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనని అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులను నియమించనున్నట్లు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ పెడుతున్న కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలన్నీ పార్లమెంట్ ఎన్నికల తరువాతనే నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది. అప్పటి వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగించడానికే మొగ్గు చూపుతోంది. వాస్తవానికి జనవరి నెలాఖరు నాటికి పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియనుంది. గతంలో పంచాయతీ ఎన్నికలకు 2019 జనవరి ఒకటో తేదీన నోటిఫికేషన్ ఇచ్చి ఉమ్మడి జిల్లాలో జనవరి 21,25,30 తేదీల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన అన్ని పంచాయతీల్లో కొత్తపాలకవర్గాలు కొలువుదీరాయి. దీని ప్రకారం ఫిబ్రవరి నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇపుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. అలాగే జూన్‌లో మండల పరిషత్., జిల్లా పరిషత్‌లకు, డిసెంబర్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల తరువాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. అలాగే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లోగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి రాజకీయ అడ్డంకులు ఉండకూడదని భావిస్తోంది. దీంతో తాత్కాలికంగా పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని యోచిస్తోంది. పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు మండల స్థాయి అధికారులు, గెజిటెడ్ అధికారులు, జిల్లాస్థాయి అధికారుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులు, మండల వ్యవసాయాధికారులు, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ తహసీల్దార్ల జాబితాలను సేకరిస్తున్నారు.

బీసీల రిజర్వేషన్లు పెంపు!

పదేళ్ల పాటు పంచాయతీల్లో రిజర్వేషన్లు ఉండే విధంగా పంచాయతీరాజ్ చట్టం-2018 రూపొందించారు. ఇప్పటికి దాదాపు అయిదేళ్లు ముగియడంతో అంటే మరో అయిదేళ్ల పాటు పాత రిజర్వేషన్లే కొనసాగే అవకాశం ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాల వారికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చింది. 42శాతం బీసీ రిజర్వేషన్ పెంచుతామని ఎన్నికల్లో ప్రకటించింది. అలాగే పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో రిజర్వేషన్లలో మార్పులు చేయడం అనివార్యంగా మారింది. దీని ప్రకారం పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు తీసుకువచ్చే అవకాశం ఉంది.

పర్సన్ ఇన్‌చార్జ్‌లు లేనట్లే

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలి. ఏదైనా కారణాల వల్ల అలా సాధ్యం కాని పక్షంలో ప్రత్యేకాధికారులను నియమించి పంచాయతీల్లో పాలన కొనసాగించాలి. పదవీ కాలం పూర్తయిన వారిని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించే అవకాశం కొత్త చట్టంలో లేదు. గతంలో ఎన్నికల నిర్వహణ ఆలస్యమైతే అప్పటి వరకు పదవిలో ఉన్న వారిని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించేవారు. కానీ 2018 పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఈ విధానాన్ని తొలగించారు. గడువులోగా ఎన్నికలు నిర్వహించకపోతే ప్రత్యేకాధికారులను నియమించి వారి ద్వారానే పాలన కొనసాగించాలనే నిబంధన పెట్టారు. ఒకవేళ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని కొత్త ప్రభుత్వం అసెంబ్లీలో చట్ట సవరణ చేయాల్సి ఉంటుంది. లేదంటే ఆర్డినెన్స్ తీసుకు రావాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి ఆలోచనేదీ చేయడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన వైపే మొగ్గు చూపుతోంది.

జేపీ దర్గాలో వైభవంగా గంధోత్సవం

▸ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వంశీచంద్‌రెడ్డి హాజరు ▸ వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కొత్తూర్, జనవరి 18: హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు గురువారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో గురువారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాలో నిర్వహించిన గంధోత్సవంలో వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రత్యేక ఆహ్వానితులుగా సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. వీర్లపల్లి శంకర్, వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అసిస్టెంట్ సెక్రెటరీ హమీద్ అహ్మద్‌తో పాటు పలువురు గంధాన్ని శిరస్సుపై ఉంచుకొని మేళాతాళాలతో ఊరేగింపుగా వెళ్లి దర్గాకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు దర్గా అవరణలోని సమావేశ హాల్‌లో పలువురు ముస్లిం మత పెద్దలు గంధానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఖవాలీ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దర్గా ముజావర్లు ముఖ్యఅతిథులకు తలపాగా చుట్టి స్వాగతం పలికి, ఆశీర్వచనాలు, గంధం, ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గంధోత్సవలం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డిలు మాట్లాడుతూ జేపీ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. గత పాలకులు దర్గా అభివృద్ధిని విస్మరించారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జేపీ దర్గాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి చిరు వ్యాపారులకు జీవనం కల్పిస్తామన్నారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దర్గాకు వచ్చే భక్తుల కోసం 50వేల వాటర్ బాటిళ్లను ఉచితంగా అందజేశారు. శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డిల పర్యవేక్షణలో స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శోభలింగంనాయక్, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు సెక్రటరీ అహ్మద్, సూపరింటెండెంట్ సత్తార్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్, సర్పంచులు అజయ్ మిట్టునాయక్, అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివశంకర్ గౌడ్, బాబర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన నిర్వహిస్తారు. ఇన్ముల్‌నర్వ తండా నుంచి కూడా గిరిజనులు గంధాన్ని తలపై పెట్టుకుని మేళాతాళాలతో నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా తరలివచ్చి దర్గాకు సమర్పించారు.



దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన గంధం బాక్స్‌లకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

వీడిన హత్య కేసు మిస్టరీ

- భర్త హత్యకు ప్రియుడితో కలిసి పథకం
- కొండారెడ్డిపల్లిలో ఘటన.. నిందితుల అరెస్టు

కేశంపేట, జనవరి 18 :కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి శివారులోని పెద్ద చెరువు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మిద్దె యాదయ్యది పోలీసులు హత్యగా తేల్చారు. విచారణ ప్రారంభించిన కేశంపేట పోలీసులు ఐదు రోజుల్లో కేసును ఛేదించారు. యాదయ్య భార్య పథకం వేస్తే.. ఆమె ప్రియుడు హత్య చేశాడు. కేసు వివరాలను షాద్‌నగర్ రూరల్ సీఐ రామిరెడ్డి గురువారం వెల్లడించారు. కొండారెడ్డిపల్లికి చెందిన మిద్దె యాదయ్య(38) వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాళ్లలో బోరుబండిపై కూలీగా పనిచేస్తున్నాడు. తనకు వచ్చే జీతాన్ని ఇంటికి పంపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, తాను సంక్రాంతికి ఈ నెల 8న ఇంటికి వస్తున్నట్లు భార్య శివలీల అలియాస్ స్వాతికి సమాచారమిచ్చాడు. అయితే, ఈ విషయానిన శివలీల తన ప్రియుడు, కోనాయపల్లికి చెందిన బర్క ఆంజనేయులుతో చెప్పింది. తన భర్త ను ఎలాగైనా చంపేయాలని ప్రియుడిని కోరింది. దాంతో ఆంజనేయులు షాద్‌నగర్‌లో యాదయ్యను బైక్‌పై ఎక్కించుకొని మార్గమధ్యంలో వైన్స్ వద్ద మద్యం కొన్నాడు. అనంతరం కొండారెడ్డిపల్లి శివారు పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ ఇద్దరూ మద్యం సేవిస్తూ గొడవపడ్డారు. దీంతో యాదయ్యను ఆంజనేయులు బండరాయితో తలపై బలంగా మోది హత్య చేశాడు. సీడీఆర్ డేటాతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా, వారి వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని యాదయ్యను హతమార్చినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడి తల్లి మిద్దె అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ వివరించారు. హత్య కేసును 5 రోజుల్లో ఛేదించిన కేశంపేట ఎస్ఐ వరప్రసాద్, క్రైం కానిస్టేబుల్ శివకుమార్, రవి, అశోక్‌రెడ్డిలను సీఐ రామిరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అభినందించారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

- అందుబాటులో 34,500 టన్నుల ఎరువులు
- డీలర్లు ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

ఆమనగల్లు, జనవరి 18: జిల్లాలో ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34,500 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎన్‌పీకే, ఎంవోపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఆమనగల్లు మండలంలో గురువారం డీఏవో గీతారెడ్డి పర్యటించారు. పలువురు రైతుల పంటలను పరిశీలించారు. ఆమనగల్లు పట్టణంలో ఎరువుల, విత్తన దుకాణాలను ఏవో అరుణకుమారితో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. డీలర్లు ఈ-పాస్ ద్వారా రైతులకు ఎరువులు విక్రయించాలని సూచించారు. ఈ-పాస్‌లో ఉన్న బ్యాలెన్స్ ఎరువుల వివరాల ప్రకారం దుకాణంలో స్టాక్ ఉండాలని, ఏమైనా తేడాలొస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవన్నారు. ఎరువుల, విత్తనాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ఆమె సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎరువుల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు గీతారెడ్డి వివరించారు. రైతులు ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆమె కోరారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని గీతారెడ్డి తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి వెంట ఏవో అరుణకుమారి, డీలర్లు సురేశ్, జంగయ్య, భరత్, రవి, శివకుమార్, వెంకటయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న గీతారెడ్డి

మూడు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్

కాలం చెల్లిన మందుల విక్రయం.. స్థాయికి మించి వైద్యం, సర్టిఫికెట్ రెన్యూవల్ చేయించకపోవడంతో చర్యలు

కొత్తూర్, జనవరి 18: కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్న పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి అధ్వర్యంలో స్థానిక వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించి మూడింటిని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల కేంద్రంలోని పెంజర్ల రోడ్డులో గల సాయిబాబా క్లినిక్, జేపీ దర్గా రోడ్డులోని జహంగీర్ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల నేహా ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లపై గురువారం దాడులు నిర్వహించారు. సాయిబాబా క్లినిక్‌లో కాలం చెల్లిన చిన్నపిల్లలు మందులు విక్రయించడానికి సిద్ధంగా ఉండడంతో స్వాధీనం చేసుకుని క్లినిక్‌ను సీజ్ చేశారు. జహంగీర్ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌లో సర్టిఫికెట్ రెన్యూవల్ చేయకపోవడంతో సీజ్ చేశారు. నేహా ఆసుపత్రి డాక్టర్ స్వరాజ్‌మాలిక్ అర్హత లేకపోయినా వైద్యం చేయడంతో ఇటీవల ఓ బాలింత మృతికి కారకుడయ్యాడు. దాంతో ఆయన క్లినిక్‌ను కూడా వైద్యాధికారులు సీజ్ చేశారు. కాగా, ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై దాడులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పలువురు ఆర్‌ఎంపీలు క్లినిక్‌లను మూసుకుని పరారయ్యారు. దాడుల్లో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, బూర్గుల డాక్టర్ రాఘవేందర్, వైద్య సిబ్బంది శ్రీహరి, శ్రీనివాస్, చిట్టిబాబు, రవికుమార్, సులోచన, ఆశాలు ఇందిర, జహంగీర్ బేగం, లత తదితరులు పాల్గొన్నారు.



పెంజర్ల రోడ్డులోని సాయిబాబా క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

స్థాయి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు : డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

ఆర్‌ఎంపీ వైద్యులు స్థాయిని మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి హెచ్చరించారు. ఆర్‌ఎంపీ సెంటర్లపై దాడుల అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎంపీ వైద్యులు రోగులకు కేవలం ఫస్ట్‌ఎయిడ్(ప్రాథమిక చికిత్స) చేసి పెద్ద ఆసుపత్రులకు పంపాలన్నారు. వైద్య నిబంధనలను అతిక్రమించి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. క్లినిక్‌లపై కేవలం ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ అని మాత్రమే బోర్డులు రాయించాలని, అనుమతులు లేకుండా ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయరాదని సూచించారు. సీజ్ చేసిన క్లినిక్‌ల వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తున్నామని, వారిపై తగిన చర్యలు తీసుకుంటారని డాక్టర్ జయలక్ష్మి తెలిపారు.

● **తాండూరు రూరల్:** రేపు(శనివారం) తాండూరు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు.





రైతులు అధికారుల సూచనలు పాటించాలి


కొత్తపల్లిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

కులకచర్ల, జనవరి 18: యాసంగి సీజన్ పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను పరిశీలించారు. సర్వేనెంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చి సాగు చేసిన పంటలను పరిశీలించి సూచనలు చేశారు. యాసంగిలో సాగు చేస్తున్న పంటలను రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర సర్వే నెంబర్ ప్రకారం నమోదు చేసుకోవాలన్నారు. సిల్క్ ఫార్మింగ్ చేస్తున్న రైతు గోపాల్ మల్బరీ తోటను పరిశీలించి తగు సూచనలు చేశారు. వరి పంటలో మోగిపురుగు, చీడ పురుగులు తగలకుండా ముందు జాగ్రత్త చర్యగా వరి నారు మడుల్లో తగినంత కార్బోఫ్యూరన్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. చలి తీవ్రత నుంచి వరి నారును కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు విశ్వనాథ్, భావన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

36మంది బాల కార్మికులకు విముక్తి


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, జనవరి 18: తాండూరు ప్రాంతంలో వివిధ చోట్ల పనిచేస్తున్న 36మంది బాల కార్మికులకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు విముక్తి కల్పించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో బాల కార్మికుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనవరి 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. తాండూరులో వివిధ చోట్ల పని చేస్తున్న 36మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు తెలిపారు. పనిలో పెట్టుకున్న ఏడుగురు యజమమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో నుంచి విముక్తి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు వారిని చదివిస్తామన్నారు. ఎవరైనా పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

ఘట్‌కేసర్, జనవరి 18: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఇళ్లమధ్య ప్రైవేట్ పాఠశాల భవనంపై నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కాలనీవాసులు గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలు, జనావాసాల నడుమ సెల్ టవర్ల నిర్మాణం జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. సెల్‌టవర్ నిర్మాణంతో రేడియేషన్ సమస్యలు తలెత్తి పిల్లల ఆరోగ్యాలపై ప్రభావం చూపే ప్రమాదముందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పక్కనే కేంద్రీయ విద్యాలయం ఉన్నదని, ఇక్కడ దాదాపు 1400మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అందరికీ ఇబ్బందిగా ఉన్నందున చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారని ఈవిషయమై పూర్తి స్థాయి విచారణ జరిపి సెల్‌టవర్ నిర్మాణం జరుగకుండా చర్యలు చేపట్టాలని మల్లేష్, రవి, లోకేష్, విజయ్, బంగారుబాబు, మణెమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.





తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి


జినుగుర్తి శివారులో బోరు పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ గౌడి మంజుల

తాండూరు రూరల్, జనవరి 18:మండలంలోని బిజ్వార్, గోనూరు, ఉద్దండాపూర్, జినుగుర్తిలో రెండు, చెంగోల్, చింతామణిపట్నం, గౌతాపూర్, అంతారం తండాలో రెండు, తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కొక్కటి చొప్పున 11 బోర్లను మంజూరు చేసినట్లు జడ్పీటీసీ తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించిన జడ్పీ చైర్‌పర్సన్‌కు మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ


పటేల్ చెరువు తండాలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

కులకచర్ల, జనవరి 18: గిరిజన మహిళలకు స్వచ్ఛంద సంస్థలు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని పటేల్ చెరువు తండాలో సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ, ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ కలిసి గిరిజన మహిళలకు రెసిడెన్షియల్ టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ పూర్తయిన 15మంది మహిళలకు వారు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో కోటాజీ, సర్పంచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్

కీసర రూరల్, జనవరి 18: లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం పన్నుల వసూళ్లపైబిల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పూర్తిస్థాయిలో వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం


పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న వీరాపూర్‌లో హెరిటేజ్ నిర్వాహకులు

కులకచర్ల, జనవరి 18: పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యమని, రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ రీజినల్ హెడ్ సర్వోత్తమ్‌రెడ్డి తెలిపారు. చౌడాపూర్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో గురువారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అందిస్తున్న రైతు రుణాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువులకు కావాల్సిన పోషక విలువలతో కూడిన పశువుల దాణాను వినియోగించుకొని నాణ్యమైన పాలఉత్పత్తిని పొందవచ్చన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతీ పాడిరైతుకు రూ.2లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన పాడి రైతు చంద్రకాంత్‌రెడ్డికి రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, పర్యవేక్షణ అధికారి వజ్రలింగం, వెటర్నరీ అసిస్టెంట్ రమేశ్, పాల సేకరణ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో ప్రతిభ


ఓంకార్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: మండలంలోని కాచవానిసింగారంకు చెందిన మట్ట ఓంకార్‌గౌడ్ నగరంలోని సీసీఎంబీలో నిర్వహించే యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్ సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్(సీసీఎంబీ) ఆధ్వర్యంలో ఏటా తెలంగాణ వ్యాప్తంగా 300మంది విద్యార్థులు చేసుకోగా రాతపరీక్ష ద్వారా 27 మందిని ఎంపికచేశారు. అందులో కాచవానిసింగారం, దివ్యనగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మట్ట ఓంకార్‌గౌడ్ ఎంపికై ప్రతిభ కనబరిచాడు. ఈ కార్యక్రమంలో ఓంకార్‌గౌడ్ యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో పరిశోధనల పట్ల ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో సీసీఎంబీ హైదరాబాద్ డైరెక్టర్ వినయ్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ



లగచర్లలో అంతర్గత రోడ్లకు అంచనాలు సిద్ధం చేస్తున్న పంచాయతీ రాజ్ అధికారులు

బొంరాస్‌పేట్, జనవరి 18: గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని వివిధ గ్రామాలకు అంతర్గత అనుసంధాన రోడ్లకు పంచాయతీ రాజ్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో గురువారం అంతర్గత రోడ్లు, అనుసంధాన రోడ్లపై సర్వేలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, వివిధ గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ టీచర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 18 : తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దత్తాత్రేయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శులు విఠల్ రెడ్డి, మోహన్ రెడ్డి మోమిన్ పేట మండల శాఖ అధ్యక్షులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





దుబాయ్ విహారయాత్రలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నేతలు

ఎమ్మెల్యే మల్లారెడ్డి దుబాయ్ టూర్

మేడ్చల్ టౌన్, జనవరి 18: మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి వెళ్లిన దుబాయ్ టూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాద్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు దుబాయ్‌లో ఆయా ప్రాంతాలను వీక్షిస్తున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి జీవనోపాధి పొందుతున్న కార్మికులతో మల్లారెడ్డి మాట్లాడి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. దీనికి తోడు దుబాయ్‌లోని ఎత్తైన భవనాలపై నిలబడి గుడ్ లక్ చెబుతున్న ఫొటోలు వైరల్‌గా మారాయి.

ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న సూరజ్‌కుమార్

కందుకూరు, జనవరి 18: ఈ నెల 22 వరకు ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీవో సూరజ్ కుమార్ సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో 13వేల బోగస్ ఓట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 6నుంచి 22 వరకు కొత్త ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గం పరిధిలో 18 ఏళ్ల నిండినవారు 2.6శాతం మంది ఓటు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 5లక్షల 50వేల 141మంది ఓటర్లు ఉండగా.. 13వేల మంది ఓటర్లు రెండు నుంచి ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఓటు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారికి తపాల కార్యాలయం ద్వారా నోటీసులు పంపుతున్నట్లు తెలిపారు. త్వరలో వారు తమకు ఎక్కడ ఓటు ఉండాలో తెలియజేయాలని, లేని పక్షంలో ఎన్నికల సంఘం ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాగా, గత శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో 10వేల మంది ఓటర్లు మరణించిన వారి పేర్లు ఓటరు లిస్టుల్లో వచ్చాయని, వాటిని తొలగించడానికి బీఎల్వోలు నివేదిక ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఉన్న 541 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు తహసీల్దార్ కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి



వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, జనవరి 18 : వైద్యాధికారులు సమయపాలన పాటించాలని లేదంటే కఠినచర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ హెచ్చరించారు. గురువారం చేవెళ్లలో వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతల విషయంలో సంరక్షణ, పర్యవేక్షణ చేయాలన్నారు. శిశు పోషణ, రక్షణలో భాగంగా సకాలంలో టీకాల నిర్వహణ, ఫిర్యాదులు వస్తే ఇంటింటి సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు ఎక్కువగా జరిగేవిధంగా చూడాలన్నారు. సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో సిహెచ్‌వోలు సంతోష, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, బలరాం వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శికి వినతి



స్మితా సబర్వాల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ మంజుల మల్లేష్

కేశంపేట, జనవరి 18: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వేముల్‌నర్వ సర్పంచ్ కటికే మంజుల మల్లేష్ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో ఆమెను కలిశారు. గత ప్రభుత్వంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చాలా కాలంగా ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమెకు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు పెడింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. స్మితా సబర్వాల్ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ చెప్పారు.

ఆలయంలో ఎంపీపీ శ్రమదానం



శ్రీ ఉమామహేశ్వరాలయంలో శ్రమధానం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: అయోధ్య రామమందిరంలో సీతారాముల విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు గురువారం ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అవుషాపూర్‌లోని ఉమామహేశ్వరాలయంలో శ్రమదానం చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను, ఇళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరోజు ప్రతీ ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, వెంకటేష్, సంతోష్, ఆలయ పూజారి సాకేత్‌శర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం

మూడుచింతలపల్లి, జనవరి 18: అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సర్పంచ్ జాము రవి తెలిపారు. గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాన్ని(జీపీడీపీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024- 2025 సంవత్సరానికి వార్షిక బడ్జెట్ ఏర్పాటు చేసి గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట్ రమణరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జాము రవి

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

కొందుర్గు, జనవరి, 18: మండల పరిధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. సంక్రాంతి రోజు ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు చివరి రోజైన గురువారం ఉదయం 5గంటలకు సుప్రభాతం, 5.30కు విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, 8గంటలకు స్వామి వారికి అభిషేకం చేశారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాన్ని కమణీయంగా పూజారులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో చెక్కల గోవిందు, శ్రీనివాస్ గౌడ్‌ర, నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. అన్నదానం చేసిన నర్సింహులు దంపతులను దేవస్థాన కమిటీ చైర్మన్ రామకృష్ణ శాలువాతో సన్మానించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన బ్రహోత్సవాల్లో.. వెంకిర్యాల, కొందుర్గు, విశ్వనాథ్‌పూర్, గంగన్నగూడ, చెర్కుపల్లి, కొత్త ఆగిర్యాల, పాత అగిర్యాల, తంగళ్లపల్లి, జిల్లెడ్-చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్, రావిర్యాల, ఎదిర, జాకారం, గుంజల్‌పహడ్, చలివేంద్రంపల్లి, పీర్జాపూర్, వెంకిర్యాల తాండ, కాస్లాబాద్ తాండ, నవాబ్‌పేట్ మండల పరిధిలోని కొల్లూరు గ్రామాల ప్రజలు ఆధిక సంఖ్యలో పాల్గొన్నారు.

44 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

శంకర్‌పల్లి, జనవరి 18 : గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. బుధవారం ఉదయం సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యక్తులను తనిఖీ చేయగా వారివద్ద ఉన్న సంచుల్లో బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లు లభించాయి. వాటిని పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు గజానంద్ సుభాష్, గోవింద్ ధారాసింగ్, శిల్పా గజానంద్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి 44 కేజీల గంజాయిని సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనసు చూరగొంటున్న మాస్టారు

14ఏళ్లలో 18 సెలవులే..

- ఒక్క విద్యార్థీ ఇతర పాఠశాలకు వెళ్తే ఒట్టు
- ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన
- ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతున్న విద్యార్థులు

మారిన ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్ఎం ఖాజామైనుద్దీన్

పూడూరు, జనవరి 18: పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు వెలుస్తుండడంతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో సరిపడా విద్యార్థులు లేరనే కారణంతో పాఠశాలను మూసివేయాల్సివస్తోంది. అయితే, వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని మేడిపల్లికలాన్ పాఠశాల మాత్రం అందుకు భిన్నమనే చెప్పాలి. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఆ పాఠశాల రూపురేఖలనే మార్చాడు. ఆ గ్రామం నుంచి ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటుకు వెళ్లడంటే నమ్మ శక్యం కాదేమో. కానీ ఇదే నిజం. ఈ పాఠశాలలో ఒకప్పుడు విద్యార్థుల సంఖ్య పెద్దగా లేకపోవడంతో పాటు మౌలిక సదుపాయాలు లేక మూతబడే స్థితికి వచ్చింది. ఇదేక్రమంలో ఈ పాఠశాలకు ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా నియమితులైన ఖాజామైనుద్దీన్ రాకతో పాఠశాల జీవం పోసుకుంది. బడిబాట పేరుతో 'ప్రైవేట్ పాఠశాల వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు' అనే నినాదంతో తల్లిదండ్రుల ఆలోచనను ఆయన మార్చేశారు. గతంలో 60 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 130మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఖాజామైనుద్దీన్ తన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం, అవగాహన కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అంతేకాదు.. ఈ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో గడగడా మాట్లాడే విధానం చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి విద్యార్థులు ఐఐటీ, నీట్ వంటి వాటిలో సత్తా చాటుతున్నారు. ఇదంతా కేవలం హెచ్ఎం ఖాజామైనుద్దీన్ వల్లేనని గ్రామస్తులు చెబుతున్నారు. 2010 నవంబర్ 4న ఈ పాఠశాలలో జాయిన్ అయిన హెచ్ఎం ఖాజామైనుద్దీన్ 2016లో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా, 2020లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.



గతంలో ఖాజామైనుద్దీన్ బదిలీ కావడంతో కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

14ఏళ్లలో 18 సెలవులే

పాఠశాలలో చదివే విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే ఖాజామైనుద్దీన్ 14ఏళ్ల తన సర్వీసులో కేవలం 18సెలవులు మాత్రమే తీసుకున్నారంటే ఆయన వృత్తిపై ఎంత నిబద్ధతతో ఉంటారో అర్థం చేసుకోవచ్చు. ఆ 18 రోజులు కూడా అత్యవసరం అయితేనే సెలవు పెట్టారు. ముఖ్యంగా 2018 నుంచి ఇప్పటి వరకు ఒక్కసెలవు తీసుకోక పోవడం విశేషం. తన వ్యక్తిగత విషయాల కోసం పిల్లల భవిష్యత్తుకు ఇబ్బంది కలగొద్దని సెలవులు పెట్టనని ఆయన చెబుతున్నారు.

మా సార్‌ను బదిలీ చేయొద్దు

గత ప్రభుత్వ హయాంలో టీచర్ల బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఖాజీ మైనుద్దీన్ కూడా బదిలీచేసింది. పాఠశాల విద్యార్థులు తమ హెచ్ఎం ఖాజామైనుద్దీన్ బదిలీని తట్టుకోలేక ధర్నాకు దిగారు. మా సార్‌ను వేరే ఊరికి బదిలీ చేయొద్దంటూ విద్యార్థులు, మేడిపల్లి గ్రామస్తులు పట్టుబట్టారు. అంతేకాకుండా ఒకరోజు విద్యార్థులు తరగతులు బహిష్కరించి మా సార్‌ను బదిలీ చేయొద్దంటూ ప్లకార్డులతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హెచ్ఎం ఖాజా మైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనలు గతంలో సంచలనంగా మారాయి. అయితే అప్పట్లో కొన్ని కారణాల వల్ల బదిలీలు రద్దు కావడంతో ఖాజామైనుద్దీన్ ఇక్కడే కొనసాగుతున్నారు. ఇప్పటికీ విద్యార్థులు, గ్రామస్తులు ఆయన బదిలీ అయితే ఊరుకోమని పేర్కొనడం గమనార్హం.

సార్ వచ్చాక ఎన్నో మార్పులు



మా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు హెచ్ఎం ఖాజా మైనుద్దీన్ సార్ వచ్చాక చాలా మార్పులు చేశారు. గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమావేశాలు నిర్వహించి బడిబాట కార్యక్రమాలు చేశారు. గ్రామంలో పూర్తిగా మార్పు వచ్చింది. మా గ్రామం నుంచి పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించడం లేదు. ఇప్పుడు నాణ్యమైన విద్య అందుతోంది. ఆయన వచ్చాక పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించాల్సిన అవసరం లేకుండా పోయింది.

రవికుమార్, ఎస్ఎంసీ చైర్మన్

నా గురువులే స్ఫూర్తి



నేను మేడిపల్లికలాన్ గ్రామానికి వచ్చి దాదాపు 14ఏళ్లు అవుతుంది. అప్పుడు కూడా నేను మా సొంత గ్రామానికి వచ్చినట్లే అనిపించింది. నా గురువులే నాకు స్ఫూర్తి. వారు నేర్పిన శిక్షణ, సంస్కారాన్ని పిల్లలకు నేర్పాలి అనుకున్నా. అప్పటికీ, ఇప్పటికీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. పిల్లల తల్లిదండ్రులకు, గ్రామప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. నాలక్ష్యం తోటి ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజల సహకారంతోనే సాధ్యమైంది.

ఖాజామైనుద్దీన్, హెచ్ఎం, ఎంపీ అప్పర్ ప్రైమరీ స్కూల్, మేడిపల్లికలాన్

మాసార్ మాకోసం సెలవు తీసుకోరు



మేమంతా ఎంతో ఇష్టంగా పాఠశాలకు వెళుతున్నాం. మా హెచ్ఎం ఖాజీమైనుద్దీన్ సార్ మా చదువు కోసం చాలా శ్రద్ధ తీసుకుంటారు. మాకోసం ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా పాఠశాలకు వస్తారు. మా సార్‌ను ఇతర పాఠశాలకు బదిలీ చేస్తే ఒప్పుకోం. నేను బాగా చదువుకుని పెద్దయ్యాక డాక్టర్ అవుతా. మా గురువుల పేర్లు, మా తల్లిదండ్రుల పేరు నిలబెడతా.

బి.సుకీర్తన, ఎం.పి.అప్పర్, ప్రైమరీ స్కూల్, మేడిపల్లికలాన్

చదువులో మా పిల్లలు ఎంతో మెరుగయ్యారు



మా పాపను గతంలో శంషాబాద్‌లోని సెయింట్‌మేరీ స్కూల్‌లో చేర్పించాను. కానీ ఖాజామైనుద్దీన్ సార్ మా ఇంటికి వచ్చి మాట్లాడారు. మా పాప భానుప్రియను, అలాగే నా కొడుకును కూడా మా ఊరి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాను. చదువులో మాపిల్లలు ఎంతో మెరుగుపడ్డారు. ఇదంతా ఖాజామైనుద్దీన్ సార్ కృషి. మూతబడుతుందనుకున్న పాఠశాలను మంచి స్థాయికి తీసుకువచ్చారు.

స్వరూప, విద్యార్థి తల్లి, మేడిపల్లికలాన్

బీఆర్ఎస్ ప్రజాధనాన్ని లూటీ చేసింది

- కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 18: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి, సంక్షేమం పేరిట ప్రజా ధనాన్ని లూటీ చేసిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఊరురా కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, మర్పల్లి, పర్వత్‌పల్లి, హంక్యానాయక్‌తండా, భోజ్యానాయక్‌తండా, నవాల్గ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు శాలువా కప్పి సత్కరించారు. అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గడిచిన పదేళ్లలో మోసపూరిత పాలన సాగిస్తూ అడుగడుగునా ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిందని, ఆదిశగా సీఎం చర్యలు చేపట్టారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను కూడా నిర్ణీత వ్యవధిలో అమలు చేస్తామని చెప్పారు. ఇందులో రెండు గ్యారంటీలు ఇప్పటికే అమలు చేస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరిలో తాండూరులో మేగా జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాలకు వస్తారని, మాయమాటలు నమ్మి మోసపోకుండా మరోసారి ఊరురా కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. త్వరలో తాండూరులో ఐటీఐ కళాశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా గిరిజన తండాల్లో మౌలిక సదుపాయల కల్పనకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ప్రతీ ఊరికి రూ.4 నుంచి 5లక్షల నిధులు కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు ఎస్.వెంకటేష్‌మహరాజ్, రామునాయక్, ఎం.శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, సర్పంచులు శాంతి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవ్‌సింగ్, సూర్యానాయక్, లాలప్ప, గోళ్లభీమప్ప, సుభాష్ పాల్గొన్నారు.

తాండూరులో అయోధ్య ఉత్సవాలు

- 22న సీతారాముల కల్యాణోత్సవం
- గోశాల సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- మూడు రోజులు ప్రత్యేక పూజలు
- హాజరుకానున్న ప్రముఖులు

తాండూరు, జనవరి 18: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో అయోధ్య ఉత్సవాలను భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 22వ తేదీన తాండూరులో వ్యాపార, వాణిజ్య విద్యాసంస్థలు, వంటి వాటి సైతం స్వచ్ఛందంగా బంద్ పాటించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మూడు రోజుల పాటు తాండూరులో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే తాండూరు పట్టణంలో రాముడి బొమ్మతో కూడిన స్వాగత తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేపట్టారు. మొదటి రోజు 22వ తేదీన ఉదయం 9 గంటలకు గోపూజ, వినాయక పూజ, 10 గంటలకు రాముల వారి అభిషేకం, ఉదయం 11 గంటల నుంచి గోశాల ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవం, భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 23న సాయంత్రం 5 గంటల నుంచి స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే సీతారాముల ఊరేగింపు, నగర సంకీర్తనలు గోశాలలో ముగిస్తాయి. అనంతరం మహాహారతి కార్యక్రమం ఉంటుంది. ఊరేగింపులో పాల్గొనే పురుషులు తెల్లదుస్తులు, మహిళలు కాషాయం చీరతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. ఈనెల 24వ తేదీన గోశాలలో సాయంత్రం 4గంటల నుంచి గీతా, సుందరకాండ పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను అర్హులందరికీ మంజూరు చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆ పార్టీ నేతలతో కలిసి నగరంలోని మంత్రి నివాసంలో కలిసి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ మేరకు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు అందుగుల సత్యనారాయణ, కె.మదన్‌పాల్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహా పాల్గొన్నారు.

అన్నోజిగూడవాసికి వివేకానంద సేవా పురస్కారం



కందుకూరు, జనవరి 18: మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామానికి చెందిన కాకి సదానందస్వామిముదిరాజ్ నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే స్వామి వివేకానంద సేవా పురస్కారం-2024కు ఎంపికైనట్లు ఆ సంస్థ నిర్వాహకులు బత్తుల హేమంత్ తెలిపారు. నేడు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, నటుడు బాబుమోహహన్ చేతుల మీదుగా అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయాలతో సంస్కార జ్ఞానం



మాట్లాడుతున్న మధు అక్కయ్య

వికారాబాద్, జనవరి 18: సంస్కార జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేయడంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందని ఓంశాంతి కేంద్రం నిర్వాహకురాలు మధు అక్కయ్య అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు బ్రహ్మబాబా స్మృతి దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక ఓంశాంతి కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శివ పరమాత్మ నుంచి బ్రహ్మజ్ఞానం పొందిన బ్రహ్మబాబా రాజయోగమార్గాన్ని మానవులకు వివరించేందుకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. మానవులను సంస్కారవంతులుగా, జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు తన సంపదనంతా దానం చేశారన్నారు. మౌంట్ అబూలో ప్రారంభమైన ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం 154 దేశాల్లో వేలాది శాఖలుగా విస్తరించి సేవలందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా బ్రహ్మబాబా సూచించిన పలు అంశాలను ఆమె వివరించారు. బ్రహ్మబాబా స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రసాదవితరణ చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: మండలంలోని కాచవానిసింగారం ప్రభుత్వ సర్వేనెంబర్ 66లో అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని వైఎస్ఎంపీపీ కర్రె జంగమ్మ గురువారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 66లో సర్పంచ్, కార్యదర్శులు ఇళ్లులేకున్నా ఇంటినెంబర్లు ఇస్తున్నారని తెలిపారు. ప్లాట్లకు నోటరీలను సృష్టించి పంచాయతీ రశీదులను తయారు చేసి అక్రమ నిర్మాణాలు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వభూమిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సర్పంచ్, కార్యదర్శిలపై చర్యలు తీసుకోవాలని ఆమె డీపీవోను కోరారు.

మహనీయుడు ఎన్టీఆర్



కొత్తూరు :ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● తెలుగుదేశం నాయకులు
● రామారావు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

ఆమనగల్లు, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కల్వకుర్తి నియోజక వర్గ కో-ఆర్డినేటర్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ పార్లమెంట్ కోశాధికారి అర్థం నర్సింహ, జిల్లా సీనియర్ నాయకుడు కండె సత్యం, నాయకులు పెంటయ్య, కండె బాస్కర్, శంకర్, శివ, ఎన్టీ పంచాక్షరి, కొరివి వెంకటయ్య, కృష్ణయ్య, కాలే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్ అన్నారు. చేవెళ్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తదితరులున్నారు.

కందుకూరు : తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆదర్శప్రాయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావని నాయులు ఎగ్గిడి సత్తయ్య, రవీందర్‌గౌడ్‌లు అన్నారు. రామారావు వర్ధంతి వేడులను మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాల్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో రామారావు వర్ధంతి వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని కొండన్నగూడ, లింగారెడ్డి గూడ గ్రామాల్లో ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీను, అంజయ్యగౌడ్, శంకరయ్య, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ నాయకులు గణేష్‌గౌడ్, యాదగిరిచారి తదితరులున్నారు.

షాద్‌నగర్ : నందమూరి తారకరామారావు వర్ధంతిని షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలోని శేషయ్యనగర్ కమ్యూనిటీ భవనంలో కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమితి అధ్యక్షులు పాతూరి వెంకట్‌రావు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక రాజకీయ ప్రభంజనం అని కొనియాడారు. రాజకీయాల్లో బీసీలకు రాజకీయ చైతన్యంతో పాటు, వారికి రిజర్వేషన్లకు నాంది పలికిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ మాత్రమే అని కొనియాడారు. కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, బి.నాగేశ్వర్‌రావు, జి.వసంత్‌రావు, జొన్నల గడ్డల శ్రీను, జి.మస్తాన్‌రావు తదితరులున్నారు.



షాద్‌నగర్ : ఎన్టీర్‌కు నివాళులర్పిస్తున్న పాతూరి వెంకట్‌రావు, పినపాక ప్రభాకర్, తదితరులు

షాద్‌నగర్ : తెలుగువారి ఆత్మగౌరవం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ నేతలు కొనియాడారు. తారకరామారావు 28వ వర్ధంతిని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు షాద్‌నగర్ ప్రధాన పట్టణ కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు మరణం లేదని, భూలోకం ఉన్నంత వరకు ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన పథకాలనే ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని చెప్పారు. పేద వారి ఆకలిని తీర్చిన ఘనత ఒక్క ఎన్టీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. నాయకులు కావలి నరసింహులు, అంజయ్య గౌడ్, బక్కని శ్రీను, రాజు, రుక్మద్దీన్, గంటల శంకరయ్య, బక్కని యాదయ్య, రవి, పట్నం రాజు తదితరులున్నారు.



ఆమనగల్లు : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యాదిలాల్, తదితరులు

కొందుర్గు : తారక రామారావు వర్ధంతిని గురువారం మండల పరిధిలోని తంగళ్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎదిరే రామకృష్ణ మాట్లాడుతూ ఆత్మగౌరవ నినాదంతో రాజకీయాల్లోకి ప్రవేశించి, దళిత, బహుజనులు ఎంతో మందికి రాజకీయ భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు. ఉపసర్పంచ్ నర్సింలు గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంచాల : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు మండల పరిధిలో ఘన నివాళులర్పించారు. ఆరుట్లలోని బస్టాండు చౌరస్తాలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఆరుట్ల కన్వీనర్ సీహెచ్ భాస్కర్, కోకన్వీనర్ దర్శన్, సీనియర్ నాయకులు ఆనంగళ్ల శ్రీను, నూకం నర్సింహ పాల్గొన్నారు.



కందుకూరు : మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం



చంద్రయ్య

శంషాబాద్, జనవరి 18 : మున్సిపల్ కేంద్రంలోని హుడా కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. కుటుంబికులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హుడా కాలనీలో నివాసముండే వై. చంద్రయ్య(38) బంధువుల ఇంటికి వెళ్లిన భార్యను తీసుకురావడానికి జనవరి 6న మహబూబ్‌నగర్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అయితే, అతడి వద్ద డబ్బులు లేకపోవడంతో 7వ తేదీన భార్యకు విషయం చెప్పాడు. దాంతో ఆమె ఇరుగుపొరుగు వారిని అడిగి డబ్బులు ఇప్పించింది. అతడు మహబూబ్‌నగర్‌కు వస్తానని చెప్పాడు. ఆ తరువాత ఎంతకూ తన వద్దకు రాకపోవడంతో తెలిసిన వారికి ఫోన్ చేసి విషయం కనుక్కుంది. ఇంటి వద్ద లేకపోవడంతో కంగారుగా మహబూబ్‌నగర్ నుంచి శంషాబాద్‌కు వచ్చి చంద్రయ్య ఆచూకీ కోసం వెతికింది. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, అతడు రెడ్ కలర్ షర్టు, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొంది. గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 18: మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలంకన్‌గూడ గ్రామంలో ఎంపీపీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీవో వెంకయ్య, సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం, జనవరి 18: ఇబ్రహీంపట్నం సబ్ స్టేషన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌పార్మర్ల మరమ్మత్తు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్, ఎంబీఆర్ నగర్, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల, చెర్లపటేల్ గూడ, నాగన్‌పల్లి, శేరిగూడ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వైట్‌గోల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని వైట్‌గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్‌టెక్స్ పార్క్, ఆక్టోపస్, సీతారాంపేట్, అంబేద్కర్‌నగర్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

పీఆర్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



కేశంపేట, జనవరి 18: పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్, డైరీని కేశంపేట మండల నోడల్ అధికారి చంద్రశేఖర్ గురువారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఆవరణలో గురువారం సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస సాగర్ నేతృత్వంలో క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస సాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ డి ఏ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు క్యాలెండర్, డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కరుణాకర్ గౌడ్, స్టేట్ అసోషియెట్ అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి



షాబాద్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిరణ్, తదితరులు

షాబాద్/కందుకూరు, జనవరి 18 : పేదల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ అన్నారు. వికసిత్ భారత్ యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో కేంద్రప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమపథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉజ్వలగ్యాస్ కనెక్షన్లు, పీఎం ఆవాస్‌యోజన, ఆయుష్మాన్‌భారత్, పీఎం జన ఆరోగ్య యోజన, సాధికారతపై మహిళలకు భరోసా, రైతు సంక్షేమానికి భరోసా, ఆహార భద్రతకుభరోసా, సహా మరెన్నో సంక్షేమపథకాలు తీసుకువచ్చిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలనే సంకల్పంతో మోదీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి అన్నారు. గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. నోడల్ అధికారి మహేష్, వ్యవసాయ శాఖ అధికారులు రవీందర్, వార్డు సభ్యులు బొక్క హన్మంత్‌రెడ్డి, ఎండి అజీజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, గ్రామస్థులు బొక్క లోకేశ్వర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, అంజయ్య, కృష్ణయ్య, పి.సుధాకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంచంద్రారెడ్డి, బస్వరెడ్డి, జంగారెడ్డి, పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి
ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్

యాచారం, జనవరి 18 : 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటర్ లిస్టులో పేరు నమోదు చేసుకునేందుకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలలో వీఆర్‌ఏలు, బీఎల్‌వోలతో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఓటర్ల నమోదుకు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్పీలకు రూ.20 వేల వేతనమివ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

ఇబ్రహీంపట్నం, జనవరి 18: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, నెలకు రూ.20 వేల వేతనం ఇవ్వాలని మెప్మా ఆర్పీలు గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 జూన్ నుంచి తమకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అక్టోబర్‌లో తమ వేతనాలను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచారని గుర్తుచేశారు. ఆర్పీలకు డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, పది లక్షల రూపాయాల ఆరోగ్య బీమా, పది లక్షల రూపాయల ప్రమాద బీమా అందించాలని వారు కోరారు. మెప్మా ఆర్పీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు బి.హంసమ్మ, నాయకులు సుజాత, శ్రీలత. అండాలు తదితరులున్నారు.

బల్మూరి వెంకట్‌కు అభినందనలు



ఆమనగల్లు, జనవరి 18: ఎమ్మెల్యే కోటా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఎంపిక పట్ల ఆమనగల్లు మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎండీ. ఫరీద్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు వస్పుల శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వెంకట్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వెంకట్‌కు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించిందన్నారు,

అయోధ్య అక్షింతలతో ర్యాలీ

కడ్తాల్, జనవరి 18: మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో గురువారం అయోధ్య అక్షింతలతో గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి బొప్పిడి గోపాల్, స్థానిక సర్పంచ్ భారతమ్మవిఠలయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. గ్రామంలో గడప గడపకూ అక్షింతలను అందజేశారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

మంచాల, జనవరి 18 : పెద్దదిక్కుని కోల్పోయిన బాధిత కుటుంబాలకు తమ సంఘం తరఫున చేయూతనందిస్తామని లింగంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పొదుపు సంఘం అధ్యక్షుడు బత్తుల మోహన్‌రెడ్డి చెప్పారు. లింగంపల్లికి చెందిన మైలారం విష్ణు(38), రాచకొండ అనంతాచారి(54) ఇటీవల మరణించగా బాధిత కుటుంబాలకు పొదుపు సంఘం ద్వారా రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి కసరమోని లింగం, పాలకవర్గసభ్యులు పరమేష్, రాజిరెడ్డి, జంగయ్య, అమరేందర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



విష్ణు కుటుంబానికి రూ.10వేలు ఇస్తున్న సభ్యులు

అన్ని బడుల్లో మౌలిక సదుపాయాలు

షాద్‌నగర్, జనవరి 18 : ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు మండల విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, వారికి మరింత నాణ్యమైన విద్యను అందించి మంచి భవిష్యత్తును ఇవ్వాలన్నారు. బాల్య దశలోనే నిరుపేదలకు విద్య పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఎంఈఓలు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అప్పుడే వారు విద్య పట్ల ఆసక్తిని పెంపొందించుకుని ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నదని, త్వరలోనే ఉపాధ్యాయ పోస్టుల నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేయనుందని తెలిపారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం నివేదికను శుక్రవారం అందజేయాలని ఎంఈవోలను ఎమ్మెల్యే ఆదేశించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 50 నుంచి 60 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి ఆయా పాఠశాలల్లోని సమస్యల గురించి అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలకు కేటాయించే అభివృద్ధి నిధుల్లో విద్యాభివృద్ధి కోసమే అధిక నిధులు కేటాయిస్తామని, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. షాద్‌నగర్, కొందుర్గు, కేశంపేట ఎంఈవోలు శంకర్ రాథోడ్, కిష్టారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.



మండల విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎయిర్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ సమావేశానికి ఎమ్మెల్యే

ప్రతిష్టాత్మకమైన ఎయిర్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. గురువారం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో నిర్వహించిన వింగ్స్ ఇండియా-2024 ఎయిర్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అరుదైన అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే కసిరెడ్డి జన్మదిన వేడుకలు

● కర్మన్‌ఘాట్, మైసిగండిలో ప్రత్యేక పూజలు
● ఆమనగల్లులో రక్తదాన శిబిరం
● పెద్ద ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు, జనవరి 18: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కసిరెడ్డి నారాయణరెడ్డి మాధవి దంపతులు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉదయం కర్మన్‌ఘాట్ అంజనేయ స్వామి ఆలయంలో కసిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ వరికుప్పల శ్రీనివాస్, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సందర్శించి ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు హన్మనాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి చందోజీ, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ, చింతల రమణారెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్ బాబాలతో కలిసి ఎమ్మెల్యే పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, తహసీల్దార్ ఆర్పీ జ్యోతి సత్కరించి అభినందనలు తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో కేఎస్‌ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్‌బాబా ఆధ్వర్యంలో యశోద ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, డాక్టర్ పరీక్షిత్, నాగరాజు, జయశ్రీ, మంజుల దేవి, మైమూనా, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమనగల్లు బస్టాండ్‌లో జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, పార్టీ నేతలతో కలిసి కేక్‌కట్ చేశారు. ముర్తోజుపల్లిలో కర్నాటి సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తలకొండపల్లి మండలం లింగరావుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ అధినేత కాసు శ్రీనివాస్‌రెడ్డి, పోలెపల్లి ఉపసర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తాళ్ల రవీందర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కసిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సూదిని కొండల్‌రెడ్డి, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, వస్పుల మానయ్య, మోహన్ రెడ్డి, భగవాన్ రెడ్డి, ఆంజయ్య, అజీం, గుజ్జల మహేశ్, వెంకట్రామ్‌రెడ్డి, గూడూరు గోపాల్ రెడ్డి, జూలూరి రమేశ్, కసిరెడ్డి రాంరెడ్డి, తొండలపల్లి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, భీష్మాచారి, శ్రీశైలం, కేశవ రెడ్డి, అనురాధకిషన్ రెడ్డి, కృష్ణనాయక్, ఎంగిళి ప్రసాద్, జహంగీర్‌బాబా, ఎండీ. ఫరీద్, సురేశ్ నాయక్, శ్రీకాంత్,గాజుల శ్రీనివాస్, నరేందర్, శ్రీశైలం, గుద్దేటి శ్రీను, లక్ష్మీ, బాబా, మహేశ్, ఓం ప్రకాశ్ రెడ్డి, మైసయ్య, కండె సత్యం, యాదిలాల్, అర్థం నర్సింహ్మ, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య, రాము, భిక్షపతి, చందోజీ, ముత్తికృష్ణ, పాలకుర్ల రాములు, మల్లేశ్‌గౌడ్, రాంచందర్ నాయక్, రాజేశ్, డిగ్రీ కృష్ణ, వెంకట్‌రెడ్డి, యాదగిరి, నరేశ్ నాయక్, సురేందర్ రెడ్డి, రాజు, రామకృష్ణ, శంకర్, రాము, ఉమావతి, కరుణాకర్, హీరాసింగ్, తులసీరామ్, జవహర్‌లాల్, వగ్గు మహేశ్, కాలే శివ, కర్నాటి కొండల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డికి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ అగ్రనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



ఆమనగల్లులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



కడ్తాలలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



కసిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీపీ శ్రీనివాస్, నల్లరఘుమారెడ్డి, ప్రభాకర్ రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కేశవులు, సత్యం, జంగయ్య, అంజన్ రెడ్డి



నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ

'గ్రామకంఠం' ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తలకొండపల్లి, జనవరి 18: మండల పరిధిలోని గట్టిప్పలపలిలో అనుమతులు లేకుండా గ్రామకంఠం భూమిని ఆక్రమించి ఓ ప్రార్థనా మందిరాన్ని నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం తలకొండపల్లి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా మతం మారి అంతకుముందు ఉన్న ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్న వారిని గుర్తించి వారికి బీసీ-సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని నర్సింహ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్, నియోజకవర్గ ఇంచార్జి బోయిన్‌పల్లి కృష్ణ, గట్టిప్పలపల్లి గ్రామ అధ్యక్షుడు దుబ్బ మల్లేశ్, నాయకులు రాజు, గణేశ్, శ్రీకాంత్, మహేశ్, మల్లేశ్, భరత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్ పీర్ దర్గాను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జనవరి 18: కొత్తూర్ మండలంలోని జహంగీర్ పీర్ దర్గాను గురువారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు సందర్శించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకొని ప్రార్థనలు నిర్వహించారు. కులం మతం కంటే మానవత్వం గొప్పదని పేర్కొన్నారు. దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హీరాసింగ్, తులసీరామ్ నాయక్, జవహర్‌లాల్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

శంషాబాద్ రూరల్, జనవరి 18 : కాంగ్రెస్ నేత మహేష్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ జిల్లా నాయకుడు కమ్మదనం జీవన్‌గౌడ్ గురువారం గాంధీభవన్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని జీవన్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం మహేషకుమార్ గౌడ్ ఎంతో కృషి చేశారని, దాన్ని గుర్తించి అధిష్ఠానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని చెప్పారు. ఎమ్మెల్సీ అవకాశం రావడం పట్ల జిల్లాలోని =నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.



మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న జీవన్‌గౌడ్

సమాజ సేవ ఎంతో గొప్పది

కందుకూరు, జనవరి 18: అన్ని సేవల కంటే సమాజసేవ గొప్పదని నేదునూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర మెడికల్ షాపు యజమాని కుందకూరి వెంకటేశ్వర్లు గుప్తా తండ్రి జనార్ధన్‌గుప్తా జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు యాదయ్య, సత్యనారాయణ, ఉపాధ్యాయులున్నారు.



విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న వెంకటేశ్వర్లు గుప్తా